# లీలావతి

శ్రీమతి సమయమంత్రి వందేమాతరంగారు

సదాసివరావుగారు కాకినాడలో పేరెన్నికగన్న న్యాయవాది. కమలాంబ ఆయన ధర్మపత్ని. వారికి హేమ ఒక్కతే సంతానం. హేమ కిప్పుడు పన్నెండవయేడు; థర్డుఫారం చదువుతోంది. వివాహమైనప్పటినుండీ హేమను చదువు మానిపించమని హేమ అత్తగారు వియ్యంకున కనేక వర్తమానాలంపింది. ఆ వర్తమానాల్ని హేమకు విశదపరచారు సదాసివరావుగారు. 'ఏవిధమైన జ్ఞానం సంపాదించందే మానివేయడం నాకిష్టం లేదు. యేదో ప్రవేశపెట్టారు కనుక మెట్రిక్యులేషనువరకైనా చదవాలనుంది' అంది హేమలత. యేకపుత్రిక సద్గుణఖని. యెదురు చెప్పలేకపోయారు రావుగారు. తమ మాట విననందున హేమ అత్తగారు కోపోద్దీపితమై మా పిల్లవానికి మారుమనువుచేయ తలచామని వర్తమానంచేసింది. అల్లుడు విద్యాసంపన్నుడగుటచే నట్టి పనికి సాహసింపడని వారి యూహ. రావుగారుకాని హేమకాని జంకలేదు. కమలాంబమాట పాటిచేయరు కదా !! సదాశివరావుగా రొకరోజున కోర్టునుంచి రాగానే కోటైనా విప్పకయే వాల్కుర్చీలో కూలబడ్డారు. నీళ్లచెంబూ తువ్వాలూ చేతగొని కమలాంబగారు వచ్చి వివర్ణమైయున్న భర్తముఖం చూచి 'అదేమి నేడిట్లున్నారు? బెజవాడలో నంతా క్షేమమా?' అంది ఆత్రంగా. 'ఆ కలియుగరాక్షసికి క్షేమము కాకేమి !! దివ్యంగా పెళ్లికి తర్లివెళుతూఉంటే !! విద్యాసంపన్నుడైన ప్రసాదింతదుర్నయానికి పాల్పడుతాడనుకోలేదు' అన్నారు కోపంగా.

'నే చెపితే విన్నారూ తండ్రీ కూతురూను! చదువో చదువో అని ఉవ్విళ్ళూరారు కాని!! ఉద్యోగం చేయనా వూళ్ళేలనా ఆడదానికి చదువు ?'

'ఛీ! నోరుమూసుకొని అవతలకు పో. ఆ ద్విపాదపశువుపాటకు తాళం వేస్తావా?'

'మంచి చెప్పినా కోపమాయె. యెల్లా చచ్చేది !! మాలమాదిగ పద్ధతులన్నీవచ్చి పడుతూంటే యెంతకని ఓర్చివుండను?' అని గొణుగుకుంటూ లోనికి వెళ్లిం దావిడ.

౨

'ఏమిటమ్మా సణుక్కుంటున్నావు?' అంది హేమ స్కూలునుంచి రాగానే.

'నీ చదువే నిన్ను అధోగతికి త్రోసింది. నీవూ మేమూకూడా యేడువవలసిందే యింక జన్మపర్యంతరం'

'అదేమిటమ్మా కొత్తగా మాట్లాడుతున్నావు? యెవరికర్మ వాళ్ళనే పీడించును కాని చదువేం చేస్తుందే?'

'ఆ—నీమొహం చేస్తుంది!! మీ నాన్నగార్నే అడుగు వెళ్లి.'

ఆఫీసు రూములో కూర్చుని పేపరు చూచుకుంటున్న వాళ్ళ నాన్నగారి వద్దకు పరుగెత్తింది హేమ. హేమను చూడగానే చాలా విచారమైంది రావుగార్కి.

'నాన్నగారూ, అమ్మ యెందుకు చాలా కోపంగావుంది యీరోజున?' అంది.

'మీ అత్తగారు అన్నంతపనీ చేసింది. నీవంటి రూపవతిని మాత్రం ప్రసాదిక బడయ లేదు హేమా!! ముందు నీ గతియేమిటో నే నూహింపలేకున్నాను తల్లీ' అన్నారు రావుగారు.

నిజానికి హేమ చాలా సౌందర్యవతియే. మరి జవాబియ్యలేదు హేమ; గబగబా మేడమీదకు వెళ్లింది. 'నాన్నగారూ. యీ వుత్తరం చూడండి. మిస్. మేరీకి వ్రాశా' నంది హేమ ఓ రోజున.

'ఇప్పటికైనా అక్కడకు వెళ్ళు నుద్దేశము లేదా హేమా?'

'నాన్నగారూ, మీ మాట కడ్డుచెప్ప సాహసించినందులకు క్షమించాలి నన్ను. యేదో కాలక్షేపం నిమిత్తం చదువుటే కాని మరేమికాదు. వాళ్ళ సౌఖ్యాని కంతరాయం కలుగజేయడం నాకిష్టంలేదు.'

'సరేనమ్మా నీయిష్టం.'

మరికొన్నాళ్ళకు హేమను వెంటనే బయలుదేరి రమ్మని మేరీ జవాబు వ్రాసింది. మెడికల్ చదువుటకు హేమ విశాఖపట్నం వెళ్ళింది. ప్రసాదునిట్లో చాలా గడబిడగా వుంది. మోటారు దిగుడాక్టరూ బండీనెక్కు డాక్టరు ఒక్కరు వెలితికాకుండా యేలూరున వున్న వైద్యు లందరూవచ్చి ప్రసాదుని భార్యయగు లీలావతిని చూచి పోవుచున్నారు. మారాము చేయుచున్నరాముని చంకనిడుకొని వీధియరుగుమీద పచారు చేయుచున్నాడు ప్రసాదు.

లేడీడాక్టరును కూడా పిలిపించి చూపించుట మంచిదని నా యుద్దేశ' మంటూ మోహనం బైటికొచ్చాడు. 'మీ రెరిగున్న వా రెవరైనావుంటే చెప్పండి పిలుచుకొస్తా' నన్నాడు ప్రసాదు. 'ఇదిగో యీ చీటిని ఆమెకు చూపండి తప్పక వస్తుంది' అన్నాడు మోహనం సైకి లెక్కుతూ.

## 3

'మరేం భయంలేదు. మీ జీవితంకోసం నా శక్తిని ధారపోస్తాను' అంది యింజెక్షనిస్తూ లేడీడాక్టరు 'మీరంతా వెల్తురు కి ఘాలికీ అడ్డులేవండి. ఇంజెక్షనిచ్చిన తర్వాత మీ కేమేనా స్వస్తతగా యున్నదా?'

'యేమి స్వస్తత? ఆయాస మెక్కువగా యున్నది.'

'యెన్ని రోజులనుంచి జ్వరం మీకు?'

'నేటికి వారం' అంది లీల.

"మీరు తెలుసుకోలేకపోయారు. పది హేనురోజులనుండి మీకు జ్వరము వస్తూనే యుండి యుండాలి!! యేమంటారు?"అంది డాక్టరు 'ఈలా తిరగండి యీమందు నోటిలో పోస్తాను త్రాగివేయండి.'

లీల ఆమెవైపు తిరిగింది. ముఖము వివర్ణమయింది. చూపు మందగించుచున్నది.

'మీరు ఎవరూ? మీ...రు...ఆమె... యే కావచ్చు...ను.'

డాక్టరు ముఖమిటు త్రిప్పింది లీలకు కనుపించకుండా.

'ఆమెయే నీవైతే నన్ను క్షమించు. అపరాధిని' అంది లీల చేతులు జోడిస్తూ.

'నే నిక్కడుంటే మీ మనోవేదన...... యేలాగుంది. వెళ్తా' నంది డాక్టరు.

'నన్ను క్షమించానంటే నిశ్చింతగా యీ లోకము విడుస్తా.'

'లీలా, నీ వేమో గడసరి వనుకున్నా. వట్టి పిచ్చిదానవు సుమా. నావలె నీవునూ వివాహమాడిన భార్యవే కాని వేరుకాదు. నే క్షమించటానిక్కి నీ తప్పులేదు' అంది హేమ లీలముంగురులు సవరిస్తూ.

'హాయిగావుంది నా ప్రాణాం పవిత్రమైన నీ హస్తస్పర్శవలన. రాము నేలా చూస్తావో నీదే భారం' అంటూ కళ్లుమూసింది లీలావతి.

౪

ఇప్పుడు లేడీడాక్టరుగా రేమిచేయ తలచుచున్నా రేమి' టన్నాడు చదువుచున్న పత్రిక టేబిలుమీద పడవేస్తూ చిరునవ్వుతో ప్రసాదు.

'ఇదిగో యీలాటి సేవలు చేయతలచుకున్నా' రంటూ తాంబూల మందించింది హేమ నవ్వుతూ.

'హేమా నేచాలా దుర్మార్గుణ్ణిసుమా!! నిన్ను మీ వాళ్ళనూ చాలా హింసపెట్టాను కాదూ ?'

'అయితే విద్యవలన వినయము నశించుననే మీ యుద్దేశమా ?'

'అట్లెన్నటికీ యూహింపలేదు. అమ్మ పట్టుదలయే కాని యితరము కాదు హేమా నన్ను క్షమించు.'

'నే నెంతటిదాన్ని మిమ్ము క్షమించటానిక్కి. మీరు నాకు వందనీయులే కాని క్షమార్హులు కాదు. ఈశ్వరుని లీల లగమ్యగోచరములు సుమండీ. లీలను తన సన్నిధికి తోడ్కొని కాని నాకు మీ సేవాభాగ్యము కలుగజేసినాడు కాదు. మాతృవిహీనుడగు రామును చుచిన నా గుండె నీరగుచున్నది.'

హేమా వాని సంరక్షణ భారము వహించువా రేరీ ?

'నేనుకూడా లీలను కలుసుకోవెళ్లా ననుకున్నారా ? రామును పెంచుట నాకొక కష్టమనియా ? లేక చేతకాదనియా మీయూహ'

'అంతమాటనకు హేమా, లీలను కలుసుకొనుటకు నీవు వెళితే నేనూ మిమ్ము అనుసరించేవాడినే. చదువులో మెలగినదానవు యివన్నీ యెప్పుడు నేర్చుంటావని...'

'చాల్లెండి. విన్నవారు నవ్వేపోతారు. సంసారనిరహ్వాణ స్త్రీలు కష్టపడి నేర్వనక్కర లేదు. ఆడదై పుట్టగానే అన్నీ తోపజేస్తాడా సర్వరక్షకుడే'

'అమ్మ జీవించియుంటే నిన్ను చాలా మెచ్చుకొని యుండును. ఆ అదృష్టం నాకు లేదు.'

ఎక్కడో ఆడుకుంటూయున్న రాము వాళ్ల నాన్నదగ్గర కొచ్చాడు. హేమను చూచి యేడ్వ మొదలెట్టాడు.

'నాన్నా ? యిదేవులూ ? అమ్మేదీ ?' అన్నాడు నాన్నవొళ్ళో కూర్చుని.

'మీ అమ్మ యిదే నాన్నా.' అన్నాడు ప్రసాదు విచారంతో.

'మీరు కూడా విచారిస్తే వాడు మరీ బెంగపడతాడు. రండి కాసేపు తోటలోకి వెళ్లి కూర్చుందాం మనస్సు నిర్మలంగా వుంటుంది. నే నెత్తుకుంటా రా బాబూ యివిగో బిస్కొత్తులు దా.' అని రాము నెత్తుకొని దారితీసింది హేమ.

మల్లెపందిరవద్ద శిలావేదికపై కూర్చున్నారు హేమాప్రసాదులు ప్రకృతి మాత నీక్షిస్తూ. జానీతో గంతులేస్తూ ఆడుకొంటున్నాడు రాము సమీపాన్నే. 'లీల లేని వెల్తి చూచారా?' అంది ప్రసాదువైపు చూపుతూ హేమ.

'విద్యావతులకు వినయము ఉండదను వారు వట్టి వెఱ్ఱివారు. అందుకు నిదర్శనం నీవే హేమా' అంటూ హృదయానికి కదుము కున్నాడు ప్రసాదు హేమను...... .....

భర్తృసేవాభాగ్యము లభింపజేసిన మోహానం వందనీయుడు. ఇప్పుడు హేమ కొక పుత్రిక కలిగినది. ఆ శిశువునకు లీలావతి పేరే పెట్టుకుంది హేమ.

---

## కాశీక్షేత్రమహిమ

రామసుబ్బారాయుఁడు, బి.ఏ. & వెంకటనారాయణగార్లు

ఉ. గౌరినిగూడి యీశ్వరుఁడు కాపురముండిన వారణాసిభా
గీరథియొద్దనన్ గలదు కేవల మోక్షమునిచ్చు ఘోరసం
సారభయంబులన్ బాలఁచి స్వస్థతకూర్చు మనంబునెంచనె
వ్వారికినైన నానగరవైభవమున్ గొనియాడ శక్యమే?

ఉ. రంగగు కాశికాపురవరంబున నుండిన విశ్వనాథునిన్
బొంగిన భక్తిభావమునఁ బొంగఁగఁజేసి భజించినంతలో
లొంగును భక్తకోటులకులోఁగడ చేసిన పాపమంతయున్
గంగను గల్పిమోక్షమును గల్పనసేయును శాశ్వతంబుగన్.

గీ. విశ్వనాథునికన్నను పెద్దవేల్పు । కాశికాక్షేత్రమహిమంబుకంటె ఘనము
జాహ్నవీనదికంటె శ్రేష్ఠముగునదియుఁ । గానఁగారాదు జగతినెందైనఁగాని.

క. కాశీపురసంస్మరణము కాశీపురదర్శనమును కాశీపతియున్
కాశీపురవాసంబును కాశీమరణంబుముక్తిఁ గలుగఁగఁజేయున్.